## పంటల అవశేషాలను కాల్చవద్దు

ప్రజాపక్షం/ మధిర : రైతులు పంటలు అవశేషాలను కాల్చడం ద్వారా మంటలు విస్తరించి ప్రమాదాలకు పంటలు నష్టాలకు దారితీసే అవకాశం ఉందని, అగ్ని ప్రమాదాల నివారణకు రైతులు సహకరించాలని మధిర రూరల్ సిఐ మధు రైతులను కోరారు. గురువారం తన కార్యాలయంలో బోనకల్, మధిర రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఒలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటలు కోతలు అయిపోయిన తర్వాత మిగిలిన అవశేషాలను కాల్చేందుకు ఎక్కువగా ప్రయత్నిస్తుంటారు అని అన్నారు. దీని వలన సమీప పొలాల్లోని పంటలకు మంటలు విస్తరించి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, కాలుష్యం పెరిగి ప్రజల్లో శ్వాసకోశ సమస్యలు పెరిగే ప్రమాదం ఉందన్నారు. పంటల అవశేషాలను కాల్చే చర్యలను నిలువరించేందుకు రైతులకు అవగాహన కల్పించే దిశగా పోలీస్‌శాఖ ద్వారా చర్యలు చేపడుతున్నామని సిఐ తెలిపారు.

## ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ప్రజాపక్షం/ మధిర : మధిర రైతు వేదిక నందు ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ క్షేత్రాలు, సౌర విద్యుత్ కేంద్రాలు, వ్యవసాయం యాంత్రికరణ డ్రోన్ వినియోగం అనే అంశాలపై రైతులకు గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ మాట్లాడుతూ సబ్సిడీ ద్వారా వ్యవసాయ యాంత్రిక పరికరాలు అందించటం వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అలాగే సోలార్ విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేసుకోవడం కోసం ప్రభుత్వం ద్వారా 85శాతం సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అద్దంకి రవికుమార్, బాణావత్ రమణనాయక్, జిల్లా అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, మండల సీనియర్ నాయకులు నిడమానూరు వంశీకృష్ణ, కౌన్సిలర్లు యన్నం కోటేశ్వరరావు, రేవతి, వినయ్, వంకాయలపాటి బాబు, ఎలక్ట్రికల్ డిఇ శ్రీనివాస్, అగ్రికల్చర్ సైంటిస్ట్ నాగజ్యోతి, టౌన్ ఎఇ అనీల్, రూరల్ ఎఇ మైథిలి తదితరులు పాల్గొన్నారు.

## వంశపారంపర్య కేన్సర్లకు ఇమ్యూనో థెరపీ చికిత్స

### అంకాలజిస్టు డాక్టర్ హరీష్ కంచర్ల




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : వంశపారంపర్య కేన్సర్లకు టార్గెటెడ్ థెరపీ, ఇమ్యూనో థెరపీ వంటి చికిత్సలు హైదరాబాద్ సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయని అంకాలజిస్టు, హెమాటో అంకాలజిస్టు డాక్టర్ హరీష్ కంచర్ల తెలిపారు. గురువారం ఖమ్మం యశోద మెడికల్ సెంటర్ నందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అంకాలజిస్టు డాక్టర్ హరీష్ కంచర్ల మాట్లాడుతూ ఊపిరితిత్తుల కేన్సర్ రోగుల తీరులో ఒక గణనీయమైన మార్పును చూస్తున్నామన్నారు. పొగ తాగని వారు, యువకులు అధిక సంఖ్యలో ఈ వ్యాధి బారినపడుతున్నారన్నారు. జన్యుపరమైన కారకాలు ముఖ్యంగా వంశపారంపర్య కేన్సర్‌లలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఎన్‌జిఎస్, పిసిర్ వంటి అధునాతన రోగ నిర్ధారణ పద్ధతులు, టార్గెటెడ్ థెరపీ, ఇమ్యూనో థెరపీ వంటి చికిత్సా విధానాలను అమలు పరుస్తున్నామన్నారు. లక్షణాలు కనిపించక ముందే ప్రమాదంలో ఉన్న వ్యక్తులను గుర్తించి తద్వారా చికిత్సలు అందించవచ్చునని తెలిపారు. ఊపిరితిత్తుల కేన్సర్ చికిత్సా విధానంలో సాంప్రదాయ కిమోథెరపీ కాకుండా టార్గెటెడ్ థెరపీ, ఇమ్యూనో థెరపీ వంటి విధానాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. తద్వారా రోగి జీవనం నాణ్యత మెరుగుపడుతుందన్నారు. టార్గెటెడ్ థెరపీ, జన్యు ఉత్పరి వర్తనాలపై, ఇమ్యూనో థెరపీ కేన్సర్ కణాలతో సమర్థవంతంగా పోరాడటానికి శరీరం యొక్క రోగ నిరోధక వ్యవస్థను మెరుగుపరుస్తుందన్నారు. అధునాతనమైన సాంకేతిక పద్ధతుల ద్వారా ఈ చికిత్సలు ప్రత్యేకంగా సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయని ఖమ్మంజిల్లా ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం. శ్రీధర్‌రావు, నాగార్జున, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 108లేక పేదలకు ప్రాణసంకటం




ప్రజాపక్షం/పినపాక: పినపాక మండల కేంద్రంలోని జానంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో 108 అంబులెన్స్ సౌకర్యం లేక పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఐ మండల కార్యదర్శి తోకటి కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర సమయంలో రోగులను జిల్లా ఆసుపత్రులకు తరలించేందుకు అంబులెన్స్ అందుబాటులో లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ప్రారంభించిన 108 వాహనం ప్రస్తుతం లేకపోవడం బాధాకరమన్నారు. ఏజెన్సీ ప్రాంతమైన పినపాకలో అత్యవసర వైద్య సేవలకు 108 ఎంతో అవసరమని తెలిపారు. 108 సేవలు సమయానికి అందక ప్రైవేట్ వాహనాల్లో రోగులను తరలిస్తుండటంతో పేదలపై అధిక ఆర్థిక భారం పడుతోందని, వాహనదారులు అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా వైద్య శాఖ అధికారులు, ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు స్పందించి జానంపేట ప్రభుత్వ ఆసుపత్రికి 108 అంబులెన్స్ ఏర్పాటు చేయాలని కోరారు.

## పంపు సెట్లకు సోలార్ కనెక్షన్‌తో అదనపు ఆదాయం: ఎడిఎ



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : సాగులో ఆధునిక పద్ధతులను అవలంభించాలని ఖమ్మం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం రైతు వారోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు రఘునాథపాలెం రైతు వేదిక నందు విద్యుత్ శాఖ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఎడిఎ సంజీవకుమార్ మాట్లాడుతూ రైతులు వ్యవసాయ పంపు సెట్లకు సోలార్ కనెక్షన్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీని వల్ల ఏడాదికి రూ.20వేల అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. పిఎం కుసుమ్ పథకం కింద రైతులు సోలార్ ఎనర్జీ ద్వారా కరెంటు ఉత్పత్తి చేసి ప్రభుత్వానికి విక్రయించవచ్చునని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె. ఉమామహేశ్వరరెడ్డి, విద్యుత్ శాఖ ఏఈలు సతీష్, శంకర్, ఏఈవోలు, విద్యుత్ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# ఆదర్శ నగరంగా 'ఖమ్మం'

ప్రజలకు మెరుగైన వసతుల కల్పన
శ్రీవారి ఆలయంతో ఆధ్యాత్మిక శోభ
మోడల్‌గా డ్రింక్ ఫ్రమ్ ట్యాప్ విధానం
మంత్రి తుమ్మల హామీ



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : హైదరాబాద్‌కు ధీటుగా ఖమ్మం నగర ప్రజలకు మెరుగైన వసతుల కల్పించి ఆదర్శంగా తీర్చిదిద్దటమే తన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గురువారం ఖమ్మం నగరంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌తో కలిసి పర్యటించి పలు డివిజన్లలో సిసి డ్రైన్లు, రోడ్లు, కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు కలెక్టర్, మంత్రి శంకుస్థాపన చేశారు. 15వ డివిజన్ అల్లిపురంలో మోడల్‌గా ఏర్పాటు చేసిన డ్రింక్ ఫ్రమ్ ట్యాప్ విధానాన్ని, పాఠశాలలో అదనపు గదుల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాజకీయాలు కాదని చేసిన అభివృద్ధి శాశ్వతంగా ఉంటుందని తెలిపారు. కార్పొరేటర్ల హయాంలో అభివృద్ధి జరిగితే వారిని పది కాలాల పాటు గుర్తుంచుకుంటారన్నారు. ఖమ్మం నగరంలో ప్రజలకు మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్పొరేషన్ నిధులతో పాటు ఇతర నిధులను తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. రూ. 200 కోట్లతో నిరంతరం తాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలకు రహదారులు, డ్రైన్లు, ఇతర సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ప్రజల చిరకాల వాంఛ అయిన శ్రీవారి ఆలయ నిర్మాణానికి కృషి చేసినట్లు తెలిపారు. ఆలయ నిర్మాణానికి 20 ఎకరాలు భూమి కేటాయించామని, టిటిడి బోర్డు కూడా నిర్మాణానికి ఆమోదం తెలిపిందన్నారు. త్వరలో పనులు ప్రారంభమవుతాయని ఆలయ నిర్మాణం పూర్తయితే చిన్న తిరుపతిగా అభివృద్ధి చెందుతుందన్నారు. నగరం నలువైపులా జాతీయ రహదారులను నిర్మాణం జరుగుతుందని ఖమ్మం చుట్టూ రింగ్ రోడ్డు కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. 15వ డివిజన్ అల్లిపురంలో దేశంలో ఎక్కడలేనివిధంగా ఇతర దేశాలకే పరిమితమైన డ్రింక్ ఫ్రమ్ ట్యాప్ విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. ప్రతి ఇంటికి శుద్ధి చేసిన నీటిని 24 గంటలు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఇంటిలోని ట్యాంకుకు శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయడం జరుగుతుందని తద్వారా ఇంట్లోని అన్ని ట్యాపులకు ఆ నీరు సరఫరా అవుతుందన్నారు. ఈ విధానాన్ని ఖమ్మం నగరంలోని అన్ని డివిజన్లలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్పొరేటర్లుగా ప్రజల మన్ననలు పొందినందుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కాంగ్రెస్ నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు

డబుల్ బెడ్రూమ్, ప్రజా దర్బార్ వినతులు
ఇందిరమ్మ ఇండ్లపై కలెక్టర్ సమీక్ష




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : అర్హులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. డబుల్ బెడ్రూమ్, ప్రజా దర్బార్ వినతులు, ఇందిరమ్మ ఇండ్ల పరిష్కార ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులతో డబుల్ బెడ్రూమ్, ప్రజా దర్బార్ దరఖాస్తులు, ఇందిరమ్మ ఇండ్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా దర్బార్ కార్యక్రమంలో మొదటి ఏడు క్లస్టర్లలో ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులలో 78 దరఖాస్తులకు సంబంధించిన పూర్తి వివరాలు అందలేదని తదుపరి సమావేశం నాటికి పూర్తి వివరాలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 6,107 డబుల్ బెడ్రూమ్ ఇండ్లు పూర్తయ్యాయని 655 ఇండ్లు నిర్మాణ దశలో ఉన్నాయని 467 ఇండ్లు ప్రారంభం కాలేదన్నారు. ప్రారంభం కానీ ఇండ్లను రద్దు చేయాలని ఆదేశించారు. ఎంపిక చేసిన 6,094 మంది లబ్ధిదారులకు ఇండ్లను అప్పగించాలని తెలిపారు. భూమి లేని పేద లబ్ధిదారులకు నిర్మాణంలో ఉన్న 655 డబుల్ బెడ్రూమ్ ఇండ్లను కేటాయించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఏడు క్లస్టర్లలో ఎల్3 దరఖాస్తులను పరిశీలించి అర్హులుగా గుర్తించిన వారిని ఎల్1 కేటగిరీకి మార్చాలని సూచించారు. ఈ సమావేశంలో పిడి హౌజింగ్ శ్రీనివాస్, ఈడిఎం దుర్గాప్రసాద్, రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ జుహేద, సిఎల్‌టిసి బి. లావణ్య, కె. రాహుల్, జాగారాం, ఎఈలు స్నేహ, యుకేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

**విద్య, వైద్య, మౌలిక వసతుల పనులు గడువు లోగా పూర్తి చేయాలి :** జిల్లాలో కొనసాగుతున్న విద్య, వైద్య, మౌలిక వసతుల అభివృద్ధి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు నాణ్యమైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకు రావాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి విద్య, వైద్య రంగాల మౌలిక వసతుల నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఆర్‌అండ్‌బి శాఖ ఆధ్వర్యంలో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని పనులను నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో 15 జూనియర్ కళాశాలల మరమ్మతు పనులు, అమ్మ ఆదర్శ పాఠశాల పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి సమీక్ష సమావేశానికి ప్రాజెక్టుల వారీగా ఎదురవుతున్న సమస్యలను స్పష్టంగా నివేదికలో పొందుపర్చాలన్నారు. ఏమైనా సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో పిఆర్‌ఎస్‌ఈ వై. వెంకటరెడ్డి, ఆర్‌అండ్‌బి ఎస్‌ఈ ఎం. యాకోబ్, ఈఈలు బుగ్గయ్య, ఉమామహేష్, బషీర్, మహేష్‌బాబు తదితరులు ఉన్నారు.

**వైద్య సేవలతో పాటు పరిపాలనపై దృష్టి :** ఆసుపత్రిలో వైద్య సేవలతో పాటు పరిపాలనపై వైద్యులు దృష్టిపెట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజతో కలిసి కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా నమోదవుతున్న రోజు వారి ఒపి, ఆసుపత్రుల్లో జరుగుతున్న ప్రసవాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రుల్లో పనిచేయని యంత్రాలు ఏమైనా ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించాలన్నారు. హెచ్‌పివి వ్యాక్సినేషన్ లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. వైద్యులు వైద్య సేవలతో పాటు పరిపాలన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఆసుపత్రి సిబ్బంది రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని కఠిన పదజాలం ఉపయోగించకూడదని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రామారావు, అదనపు డిఎం అండ్‌హెచ్‌వో చందునాయక్, ఎన్‌సిడిపివో అరుణాదేవి, డిఐవో టి. సంపత్, ఐ. మోత్యా, వైద్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని 15వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు మేయర్ పునుకొల్లు నీరజ శంకుస్థాపన చేశారు. గురువారం డివిజన్ పరిధిలోని అల్లిపురం, పుట్టకోట, కొత్తగూడెం ప్రాంతాల్లో సిసి డ్రైన్లు, సిసి రోడ్డు నిర్మాణ పనులకు మేయర్ పునుకొల్లు నీరజ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వసతుల కల్పనకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నట్లు తెలిపారు. విలీన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేకంగా దృష్టిసారించి రహదారులు, డ్రైనేజీ సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహరా, కార్పొరేటర్ రావూరి కరుణ సైదుబాబు, సొసైటీ ఛైర్మన్ రావూరి సైదుబాబు, నాయకులు సంక్రాంతి నాగేశ్వరరావు, చేతుల నాగేశ్వరరావు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లు త్వరితగతిన పూర్తి

### సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్



ప్రజాపక్షం/కల్లూరు: సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, పెనుబల్లి, వేంసూరు మండలాలలో మొదటి దశ ఇందిరమ్మ గృహాలను పూర్తి స్థాయిలో పూర్తిచేసి లబ్ధిదారులకు అందించాలని అధికారులకు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ సూచించారు. ఎంపీడీవోలు గృహ నిర్మాణ శాఖ అధికారులు కల్లూరు కమిషనర్ తో గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష సమావేశం జరిగింది. మొదటి దశలో మంజూరైన ఇండ్లు పూర్తయిన ఇండ్లు పలు దశల్లో నిర్మాణంలో ఉన్న గృహాలను సమీక్షించారు. వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా అందించి గృహ ప్రవేశాలు చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, కల్లూరు కమిషనర్ రాజశేఖర్, విద్యుత్ శాఖ అధికారి పవన్, మండల శాఖ అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా ప్రజల నుంచి ఫిర్యాదులు లేకుండా చూసుకోవాలని సూచించారు.

## విపత్తుల నిర్వహణకు ముందస్తు ప్రణాళిక

### కలెక్టర్ అంకిత్




ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : జిల్లాలో వరదలు, అటవీ ప్రాంతాల్లో సంభవించే ప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కునేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసి విపత్తుల నిర్వహణకు సంబంధించి మాక్ ఎక్సర్‌సైజ్‌ల నిర్వహణపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. గురువారం జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ (ఎన్‌డిఎంఎ) ఆధ్వర్యంలో వరదలు, అటవీ ప్రమాదాల నియంత్రణలపై జిల్లా స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోదావరి పరివాహన ప్రాంతాల్లో వరదలు సంభవించినప్పుడు జిల్లాలో ముందస్తు, తక్షణ చర్యలను వివరించారు. వరదల అంచనా విధానం, ముందస్తు హెచ్చరికలు జారీ, కంట్రోల్ రూమ్ ఏర్పాటు, పునరావాస కేంద్రాల నిర్వహణ, లోతట్టు ప్రాంతాల్లో శాశ్వత పరిష్కార చర్యలపై సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. గత అనుభవాలు, సూచనలను దృష్టిలో పట్టుకుని వరదలు, అటవీ ప్రమాదాల సమయంలో అధికార యంత్రాంగం సమన్వయంతో స్పందించేలా సమగ్ర మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో ఎన్‌డిఆర్‌ఎఫ్ లీడ్ కన్సల్టెంట్ మేనేజర్ సుధీర్ బహల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, కొత్తగూడెం ఆర్‌డిఓ మధు, సిపిఓ సంజీవరావు, మిషన్ భగీరథ అధికారి తిరుమలేష్, పౌరసరఫరాల శాఖ మేనేజర్ త్రినాధ్, ఆర్‌అండ్‌బి ఇఇ నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీలో 'ఎన్‌ఎంఎంఎస్' రద్దు చేయాల్సిందే

### బికెఎంయు డిమాండ్



ప్రజాపక్షం/చింతకాని : ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్‌లో ప్రవేశపెట్టిన 'ఎన్ ఎంఎంఎస్' వలన ఉపాధిహామీ కార్మికులకు నష్టం కలుగుతుందని, దీనిని తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాటి వెంకటేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం చింతకాని మండలం నేరడ గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఎన్‌ఎంఎంఎస్ పద్ధతిలో రోజుకు రెండు సార్లు ఫోటోలు తీసి అప్‌లోడ్ చేయాలని సాంకేతికంగా ఈ పద్ధతి ఇబ్బందికరంగా మారిందని ఏరోజుకారోజు నమోదు చేసుకోకపోతే పనిలో చేరడం కుదరడంలేదన్నారు. ఈ నిబంధన వల్ల పథకం ప్రయోజనాలు దెబ్బతిన కూలీలకు ఉపాధి అందని ద్రాక్షగా మారుతుందన్నారు. నూతనంగా ప్రవేశపెట్టిన ఎన్ ఎంఎంఎస్ విదానాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కూలీ డబ్బులు వారం వారం ఖాతాల్లో జమచేయాలన్నారు. ప్రస్తుత నిత్యావసర ధరల దృష్ట్యా రోజు కూలీ రూ.700 చెల్లించాలని డిమాండ్ చేశారు. వేసవి అదనపు అలవెన్సులు ఇవ్వాలని వడగాల్పులకు ఓఆర్‌ఎస్, మజ్జిగ ప్యాకెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ చింతకాని మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, మండల కార్యదర్శి గోగుల ఆది, నాయకులు రాగం లింగరాజు, వార్డు మెంబర్ అమడాల వెంకటేశ్వర్లు, మేడ భాస్కర్, బత్తుల కృష్ణమూర్తి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ఉలిక్కిపడ్డ ఫోర్జరీ మాఫియా..!

తేలుకుట్టిన దొంగల్లా కీలక నిందితులు మౌనం
ప్లాట్ కొనుగోలుదారులకు తప్పని తిప్పలు
మాజీ ప్రజాప్రతినిధులపై వెల్లువెత్తుతున్న విమర్శలు

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఖమ్మంరూరల్ మండలాన్ని కుదిపేసిన నకిలీ డాక్యుమెంట్ల బాగోతంపై 'ప్రజాపక్షం' ప్రచురించిన కథనం జిల్లావ్యాప్తంగా తీవ్ర చర్చనీయాశంగా మారింది. ఈ వ్యవహారంలో పాలుపంచుకున్న పలువురు వ్యక్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడినట్లు తెలుస్తోంది. ఫోర్జరీలో కీలక పాత్ర పోషించిన వారిపై కథనం ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందని సమాచారం. అయితే ప్రధాన సూత్రధారులుగా భావిస్తున్న కొందరు రియల్ ఎస్టేట్ నిర్వాహకులు మాత్రం తేలు కుట్టిన దొంగల్లా మౌనం వహిస్తున్నారు. ఈ వ్యవహారం ఎటు తిరుగుతుందోన్న భయంతో సన్నిహితులతో ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా, నకిలీ డాక్యుమెంట్ల కారణంగా ప్లాట్లను కొనుగోలు చేసిన పలువురు బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ పరిస్థితి ఏంటి? అన్న అనిశ్చితిలో ఉన్నామని చెబుతున్నారు. సంబంధిత అధికారులకు విషయం తెలిసినప్పటికి పూర్తి స్థాయిలో తప్పుడు వ్యవహారాలపై చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, పోలీస్‌శాఖలు సంయుక్తంగా విచారణ జరిపి పూర్తి స్థాయి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. బాధితులకు న్యాయం చేయడంతో పాటు ఇలాంటి మోసాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు అవసరమని అభిప్రాయం వ్యక్తమవుతోం ది.

**ప్లాట్ కొనుగోలుదారులకు తిప్పలు...** ఒకప్పుడు ఖమ్మం రూరల్ మండలం రియల్ ఎస్టేట్ వ్యాపారానికి చిరునామాగా నిలిచింది. సామాన్యుల నుంచి ఉద్యోగుల వరకు సొంత ఇంటి కల నెరవేర్చుకోవాలని భావించిన వారు ఈ ప్రాంతంలో ప్లాట్లు కొనుగోలు చేసేవారు. అయితే ఖమ్మం కార్పొరేషన్‌లో విలీనమైన తరువాత పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. నియంత్రణ లేకుండా పెరిగిన రియల్ ఎస్టేట్ వ్యాపారం క్రమంగా ఫోర్జరీలు, నకిలీ డాక్యుమెంట్ల దిశగా దారి తీసింది. ఈ అక్రమాల వల్ల కొంతమంది రియల్ వ్యాపారులు కోట్ల రూపాయల అర్జించినప్పటికీ, నిజమైన నష్టాన్ని మాత్రం ప్లాట్ కొనుగోలుదారులే భరించాల్సి వస్తోంది. ఒకే ప్లాట్‌ను పలువురికి అమ్మడం, నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్లు చేయడం, అనుమతులు లేని లేఅవుట్ల విక్రయాలు వంటి ఘటనలు వెలుగులోకి రావడంతో ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ప్రస్తుతం ఖమ్మం రూరల్ మండలంలో ప్లాట్ కొనుగోలు చేయాలంటేనే ప్రజలు వెనకడుగు వేస్తున్నారు. ఏ స్థలం అసలైనదో, ఏది వివాదస్పదమో తెలియని గందరగోళం ఏర్పడింది. దీంతో రియల్ ఎస్టేట్ రంగంపై నీలినీడలు కమ్ముకున్నాయి. అంతేకాకుండా జిపిఎ రిజిస్ట్రేషన్‌లతో కొనుగోలుదారులను వ్యాపారులు నిండా ముంచారు. ఇ లా చేసిన రిజిస్ట్రేషన్‌లతో కొనుగోలుదారులు నిత్యం భయం భయంతో బ్రతుకుతున్నారు. ఈ దందాలు మం చి పేరుగాంచిన ప్రధాన రియల్ ఎస్టేట్ వ్యాపారులే చేయడం గమనార్హం.

**మాజీ ప్రజాప్రతనిధుల గుండెల్లో గుబులు..** ఖమ్మంరూరల్ మండలంలో వెలుగుచూస్తున్న అక్రమ ఫోర్జరీ వ్యవహారం ఇప్పుడు రాజకీయ వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. ఈ దందాలో కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారులే కాకుండా, వారితో సన్నిహిత సంబంధాలు కొనసాగించిన కొందరు మాజీ ప్రజాప్రతినిధుల పాత్రపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రియల్ వ్యాపారులతో అనుబంధాలు పెంచుకున్న కొందరు మాజీ ప్రజాప్రతినిధులు సులభంగా భారీ మొత్తంలో డబ్బులు వస్తుండంతో ఈ వ్యవహారంలో భాగస్వాములైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎలాంటి పెట్టుబడి లేకుండానే లావాదేవీలు జరగడం, భూముల వ్యవహారల్లో వేలు పెట్టి ఆస్తులు కూడగట్టినట్లు వినికిడి. ఈ అక్రమ దందాలో ముఖ్యంగా ఓ పక్క మండలానికి చెందిన మాజీ ప్రజాప్రతనిధితో పాటు ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని కొందరు మాజీ ప్రజాప్రతినిధులు, అలాగే వెంచర్లు ఏర్పాటైన గ్రామీణ ప్రాంతాలకు చెందిన మాజీ నాయకుల పేర్లు కూడా వినిపిస్తున్నాయి. దీంతో రాజకీయవర్గాల్లో కలకలం రేగుతోంది. ఈ ఆరోపణలపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ లేకపోయినా, పూర్తి స్థాయి విచారణ జరిగితే మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

ప్రజాపక్షం ఎఫెక్ట్

## విద్యుత్ సేవలు అమోఘం



ప్రజాపక్షం/పాల్వంచ : విద్యుత్‌శాఖ ప్రజలకందించే సేవలు నాణ్యమైనవని, గృహ వినియోగదారులకు, రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నామని పాల్వంచ విద్యుత్ శాఖ అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్ రహీముల్ హుస్సేన్ అన్నారు. మండల పరిధి జగన్నాధపురం రైతు వేదికలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వ్యవసాయ క్షేత్రాలు, విద్యుత్ కేంద్రాలు, రైతువారోత్సవాలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఇ మాట్లాడుతూ విద్యుత్‌శాఖ నేతృత్వంలో ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించటానికి నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. అమలు చేస్తున్న పథకాలను వివరించారు. గృహజ్యోతి పథకంలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్, పిఎంజెయుజిఎ, పిఎం కుసుం, ప్రజాబాట తదితర కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. రైతులకు అందజేస్తున్న సంక్షేమ పథకాలు, విద్యుత్ ప్రమాదాలపై తీసుకొంటున్న భద్రతా చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ బొగ్గా నారాయణ, మండల వ్యవసాయాధికారి శంభోశంకర్, జగన్నాధపురం, పునుకుల సర్పంచ్‌లు అనిత, వజ్జా క్రిష్ణవేణి, రూరల్ ఏఈ రవీందర్, రైతులు, విద్యుత్ వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయంలో రైతులు.. టెక్నాలజీ ఉపయోగించుకోవాలి

అదనపు కలెక్టర్ నగేష్



**ప్రజాపక్షం/కొల్చారం :** వ్యవసాయంలో నూతన టెక్నాలజీని అంది పుచ్చుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ రైతులకు సూచించారు. గురువారం కొల్చారం మండలం పోతన్ శెట్టిపల్లిలో జరిగిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రైతు వరము సమావేశంలో ముఖ్య అతిథిగా నగేష్ పాల్గొన్నారు. వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన స్టాళ్లను పిరిశీలించారు.మన దేశం వ్యవసాయ ఆధారిత దేశమని, రైతులు వ్యవసాయంలో నూతన టెక్నాలజీని అంది పుచ్చుకోవాలని పిలునిచ్చారు. నూతన వంగడాలు, పనిముట్లు, యంత్రాలను ఉపయోగించి పంటల ఉత్పత్తి పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, స్థానిక తహసిల్దార్, అధికారులు పాల్గొన్నారు.

## వరద నివారణపై 'మాక్ డ్రిల్'

(ఎన్‌డిఎంఎ) కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, ఎస్‌పి జానకి షర్మిల



**ప్రజాపక్షం / నిర్మల్ :** రానున్న వర్షాకాలం దృష్ట్యా వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, అత్యవసర సహాయక కార్యక్రమాలపై జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డిఎంఎ) గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. నిర్మల్ జిల్లా కలెక్టరేట్ నుండి ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ భవేశ్‌మిశ్రా, జిల్లా ఎస్‌పి డా.జి. జానకి షర్మిల పాల్గొన్నారు. శాఖల మధ్య సమన్వయం అవసరం.జిల్లాలో వరద ముప్పు ఉన్న ప్రాంతాలను గుర్తించి, అక్కడ ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. విపత్తు సమయాల్లో ప్రాణ, ఆస్థి నష్టాన్ని నివారించడానికి అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సహాయక బృందాలు, రెస్క్యూ టీమ్స్ ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన చోట మాక్ డ్రిల్స్ నిర్వహించి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని పేర్కొన్నారు. అధికార యంత్రాంగం వరదల సమయంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, మౌళిక సదుపాయాల కల్పన , వైద్య సేవలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, ఎస్.పి.లతో పాటు అదనపు కలెక్టర్, కిషోర్, , భైంసా సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## విపత్తుల సన్నద్ధతపై పకడ్బందీ ఏర్పాట్లు

**ప్రజాపక్షం/నిజామాబాద్:** ప్రకృతి విపత్తులు, వరదలు సంభవించిన సమయాల్లో చేపట్టాల్సిన తక్షణ చర్యలపై అవగాహనతో పాటు సన్నద్ధతను మరింత పెంపొందించేందుకు జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ సహకారంతో ఈనెల 18న జిల్లాస్థాయిలో ప్రయోగాత్మకంగా నిర్వహించనున్న మాక్ ఎక్సర్‌సైజ్‌ను పకడ్బంధీగా నిర్వహించాలని ఉన్నతాధికారులు సూచించారు. మాక్ ఎక్సర్‌సైజ్‌కు సంబంధించిన ముం దస్తు ఏర్పాట్లపై గురువారం ఉన్నతాధికారులు వీ డియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించగా నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. మాక్ డ్రిల్ నిర్వహణకు నిర్ణీత ప్రణాళిక, ఆయా శాఖల బాధ్యతలు, అగ్నిప్రమాదం సంభవించిన వెంటనే చేపట్టాల్సిన తక్షణ చర్యలు, సమన్వయం, సమాచార వ్యవస్థ అత్యవసర సేవల నిర్వహణ వంటి అంశాలపై అధికారుల కు మార్గనిర్ధేశం చేశారు. మాక్‌డ్రిల్‌ను ఈనెల 18న నిర్వహించాలని సూచించారు. విపత్తులు, వరదలు, ఊహించని రీతిలో ప్రమాదాలు జరిగిన సమయంలో ఎలా స్పందించాలి, ఆస్తి, ప్రాణ నష్టం నివారించేందుకు ఏవిధమైన చర్యలు తీసుకోవాలి, వివిధ శాఖల మధ్య సమన్వయం ఎలా ఉండాలనే అంశాలపై ఈ మాక్ ఎక్సర్‌సైజ్ ద్వారా ప్రయోగాత్మకంగా అవగాహన కలుగుతుందని, విపత్తులను ఎదుర్కొనే విషయంలో సన్నద్ధత ఏ మేరకు కలిగి ఉన్నామనేది అవగతమవుతుందన్నారు. గతేడాది భారీ వర్షాలు కురిసిన సందర్భంగా ఆయా జిల్లాల్లో పలు గ్రామాలు వరద ప్రభావానికి లోనయ్యాయని గుర్తు చేశారు. భవిష్యత్తులో ఇలాంటి విపత్తులు మళ్లీ ఏర్పడితే వాటిని సమర్థవంతంగా ఎదుర్కొని ముంపు ప్రాంతాల ప్రజలను కాపాడటం, సురక్షిత ప్రాంతాలకు తరలించి పక్కాగా సహాయక చర్యలు చేపట్టేందుకు మాక్ ఎక్సర్‌సైజ్ దోహదపడుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని మాక్ ఎక్సర్‌సైజ్‌ను పకడ్బంధీగా విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అన్ని శాఖల అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లతో సంసిద్ధంగా ఉండాలని సూచించారు. మాక్ ఎక్సర్‌సైజ్‌ను ప్రయోగాత్మకంగా నిర్వహించటం జరుగుతుందని ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురి కావదని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీఓ రాజేంద్రకుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మతసామరస్యంతో బక్రీద్ నిర్వహణ




**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ జిల్లా లో బక్రీద్ పండుగను శాంతియుతంగా, మతసామరస్య వాతావరణంలో నిర్వహించాలని జిల్లా ఎస్పీ డి వి శ్రీనివాసరావు సూచించారు. గురువారం జిల్లా పోలీస్ కార్యలయంలో ఖురేషి కులస్తులు, విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్, ఆర్‌ఎస్‌ఎస్, హిందూ వాహిని, శ్రీరామ్ సేన, హిందూ యువవాహిని సభ్యులతో జిల్లా ఎస్పీ డి వి శ్రీనివాసరావు, మెదక్ డిఎస్పీ ప్రసన్న కుమార్ తో కలిసి సంఘాల ప్రతినిధులతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ పశువుల అక్రమ రవాణాపై జీరో టాలరెన్స్ విధానం అమలు చేస్తున్నామని, ప్రత్యేక చెక్‌పోస్టుల ద్వారా వాహనాల తనిఖీలు కొనసాగుతున్నాయని తెలిపారు. సరైన పత్రాలు ఉన్న పశువులను మాత్రమే సంహరించాలని, ఆవుల వధకు పాల్పడవద్దని ఖురేషి కులస్తులకు సూచించారు. గోరక్షణ పేరుతో చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, అనుమానాస్పద సమాచారం ఉంటే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. మెదక్ సీఐ లు జర్జ్, సందీప్ రెడ్డి, వటర్నరీ డాక్టర్ లక్ష్మ ణ్, పోలీస్ సిబ్బంది, మత పెద్దలు, పాల్గొన్నారు.

## నిర్మల్ పల్లెల్లో 'కో-ఆప్షన్ సెగ'..

# పదవుల వేటలో ఆశావహులు!

**ప్రజాపక్షం / నిర్మల్ :** నిర్మల్ జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో కోఆప్షన్ సభ్యుల నియామక ప్రక్రియ ఎప్పుడు మొదలవుతుందా అని జిల్లా వ్యాప్తంగా ఉన్న ద్వితీయ శ్రేణి నాయకులు వేయి కళ్ళతో ఎదురుచూస్తున్నారు. జిల్లాలోని 18 మండలాల పరిధిలో ఉన్న సుమారు 400 గ్రామ పంచాయతీల్లో పాలకవర్గాలు కొలువు దీరి నాలుగు నెలలు గడుస్తున్నా ఇం కా కోఆప్షన్ సభ్యుల నియామకానికి మోక్షం లభించ లేదు.ముఖ్యంగా ఇటీవల మున్సిపల్ కోఆప్షన్ ఎన్నికలు పూర్తి కావడంతో, ఇప్పుడు అందరి దృష్టి పల్లె పంచాయతీల పైనే పడింది.




### ప్రతీ గ్రామ పంచాయితీలోనూ త్రిముఖ పోటీ

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి గ్రామ పంచాయతీలో ముగ్గురు కోఆప్షన్ సభ్యులను నియమించాల్సి ఉంటుంది. ఈ లెక్కన జిల్లాలోని 400 పంచాయతీల్లో కలిపి మొత్తం 1200 పదవులు అందుబాటులో ఉన్నాయి. గ్రామ సమాఖ్య అధ్యక్షురాలితోపాటు ఇద్దరు విద్యావంతులు లేదా దాతలకు ఇందులో అవకాశం కల్పించాల్సి ఉంటుంది. గత ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం శ్రమించిన కార్యకర్తలు తమకు ఈ పదవి ద్వారా లభిస్తుందని గట్టి ఆశతో ఉన్నారు.

### ఎమ్మెల్యేల వద్ద మొదలైన సిఫార్సుల పర్వం

జిల్లాలోని 18 మండలాల్లో ఉన్న ఆశావహులు ఇప్పటికే తమ తమ నియోజకవర్గాల ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తమకు ఈ పదవి ఇప్పించాలని, భవిష్యత్తులో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని హామీలు ఇస్తున్నారు. నియోజకవర్గ స్థాయి నేతలు ఇప్పటికే జాబితాలను సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. అధికారిక ఉత్తర్వులు వెలువడడమే తరువాయి.

### అభివృద్ధిలో భాగస్వామ్యం కోరుతున్న విద్యావంతులు

కేవలం రాజకీయ నాయకులే కాకుండా, గ్రామాభివృద్ధిపై అవగాహన ఉన్న రిటైర్డ్ ఉద్యోగులు, విద్యావంతులు కూడా ఈ సారి కోఆప్షన్ పదవుల వైపు ఆసక్తి చూపుతున్నారు. దాతలు కూడా పాఠశాలల అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు తాము చేసిన సేవలను గుర్తిస్తూ ఈ పదవుల్లో అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఓటు హక్కు లేకపోయినా, అధికారికంగా పంచాయతీ వ్యవహారాల్లో తలదూర్చే అవకాశం ఉండటం ఈ పదవులకు ఉన్న ప్రధాన ఆకర్షణ.

### నోటిఫికేషన్ కోసం జిల్లా యంత్రాంగం నిరీక్షణ

రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ నుంచి స్పష్టమైన మార్గదర్శకాలు అందాల్సి ఉంది. జిల్లా యంత్రాంగం ఇప్పటికే మండలాల వారిగా ఖాళీలను గుర్తించి సిద్ధంగా ఉంచింది. ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన వెంటనే 18 మండలాల పరిధిలోని 400 పంచాయతీల్లో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. ప్రస్తుతం సాగుతున్న రాజకీయ లాబీయింగ్ చూస్తుంటే , ఈ కోఆప్షన్ నియమకాలు జిల్లాలో కొత్త రాజకీయ సమీకరణాలకు దారి తీసేలా కనిపిస్తున్నాయి. అప్పటి వరకు ఆశావహులకు నిరీక్షణ, నేతలకు సిఫార్సుల ఒత్తిడి తప్పేలా లేదు.

## మంత్రి సీతక్కను కలిసిన ఎమ్మెల్యేలు



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతా రావు, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌లు గురువారం కామారెడ్డి జిల్లా ఇంచార్జీ మంత్రి, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి నియోజకవర్గంలో జరుగుతున్న ఆయా అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణ పనులు వేగంగా పూర్తయ్యేలా, లబ్ధిదారులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని, పరిసరాల్లో ఉన్న వనరులను వినియోగించుకుని ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. పోలీసు, పంచాయతీరాజ్, అటవీశాఖ, రెవెన్యూ శాఖ అధికారులు పూర్తిస్థాయిలో సహకారం అందించాలని కోరారు. ఇందిరమ్మ ఇంటి లబ్దిదారులు ఎదుర్కొంటున్న వారి సమస్యలు వివరించగా సత్వరమే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యేలు తెలిపారు.

## పట్టణాభివృద్ధి ధ్యేయం.. జర్నలిస్టుల కాలనీలో వసతులు

ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు



**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ పట్టణ సమగ్రాభివృద్ధి ధ్యేయంగా ముందుకు పోతున్నామని జర్నలిస్టుల కాలనీకి అన్ని వసతులు కల్పిస్తామని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. గురువారం మెదక మున్సిపాలిటీ పరిధిలో టియూఎఫ్ఐడిసి, ఎస్ బిఎం పథకాల కింద రూ. 37.01 కోట్ల వ్యయంతో 1,2,3, 5,6,7, 12,13, 14,19,28, వార్డులలో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు, స్లాబ్‌ల నిర్మాణాలకు మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తో కలిసి ఎమ్మెల్యే రోహిత్ రావు పనులకు శంఖుస్థాపనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ. 37.01 కోట్ల వ్యయంతో పట్టణ అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందన్నారు. అభివృద్ధికి చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. మెదక్ పట్టణాభివృద్దే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యంగా ముందుకుపోతుందన్నారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు చేపట్టిన పనులు చరిత్రతో నిలిచిపోయే విధంగా ఉన్నాయన్నారు. మెదక్ ప్రాంత ప్రజల అభివృద్ధి చేయాలని ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు తెలిపారు. మెదక్ నియోజకవర్గంలోని అన్ని మండలాలకు నిధులు మంజూరు చేస్తూ పనులు చేపడుతున్నామన్నారు. నియోజకవర్గంలో అన్ని మండలాలు గ్రామాలు మున్సిపాలిటీలో అంచెలంచెలుగా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఆయా వార్డుల కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్‌ఐఆర్‌లో నిర్లక్ష్యం వహిస్తే వేతనాలు నిలిపివేస్తాం

కలెక్టర్ ఇలా త్రిపాఠి





**ప్రజాపక్షం/నిజామాబాద్:** ఎన్నికల సంఘం మార్గదర్శకాలకనుగుణంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్) సన్నాహక ప్రక్రియను ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు. అర్బన్ నియోజకవర్గంలో ఎస్‌ఐఆర్ మ్యాపింగ్ అమలు తీరుపై కలెక్టర్ గురువారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో ఎఈఆర్‌ఓలు,బిఎల్‌ఓ సూపర్‌వైజర్లతో సమీక్ష నిర్వహించారు. ఒక్కొ పోలింగ్ కేంద్రం వారిగా ఎస్‌ఐఆర్ మ్యాపింగ్ అమలును పరిశీలిస్తూ పని తీరులో వెనుకంజలో ఉన్న ఎఈఆర్‌ఓలు, బీఎల్‌ఓ సూపర్‌వైజర్లతో సమీక్ష నిర్వహించారు. ఒక్కొ పోలింగ్ కేంద్రం వారిగా ఎస్‌ఐఆర్ మ్యాపింగ్ అమలును పరిశీలిస్తూ పని తీరులో వెనుకంజలో ఉన్న ఏఈఆర్‌ఓలు, బీఎల్‌ఓ సూపర్‌వైజర్లను కారణాలు అడిగి తెలుసుకున్నారు. అర్బన్‌లో మ్యాపింగ్ ప్రక్రియ మందకోడిగా సాగడంతో జిల్లా సగటుపై ఇది ప్రభావం చూపుతోందన్నారు. ఎస్‌ఐఆర్ అమలులో స్పష్టమైన ప్రగతి సాధించాల్సిందేనని స్పష్టం చేశారు. ఒక్కొ పోలింగ్ కేంద్రం వారిగా బీఎల్‌ఓలతో మ్యాపింగ్‌ను పక్కాగా జరిపించాలని, రోజువారిగా నిశిత పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. ఓటరు జాబితాలో బోగస్ ఓటర్లు, చనిపోయిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లు ఉండరాదని, అదే సమయంలో అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుండి తప్పిపోకూడదన్నారు. ఓటరు జాబితా పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశ్యంతోనే ప్రత్యేక సమగ్ర సవరణను ఎన్నికల సంఘం చేపట్టిందన్నారు. అవగాహన కల్పించేందుకు విస్తృతస్థాయిలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకునేలా చూడాలని, మ్యాపింగ్ ప్రక్రియ పురోగతి కోసం వారి సహకారం తీసుకోవాలని సూచించారు. ప్రత్యేక సమగ్ర సవరణ ఎవరైనా ఓటు హక్కు రాని వారు ఉంటే ఆక్షేపణ చేయవచ్చన్నారు.నగరపాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు బాలరాజ్, నిజామాబాద్ సౌత్ తహసీల్దార్ శ్రీధర్, అధికారులు పాల్గొన్నారు.

# ఇన్సూరెన్స్ ముసుగులో ఆరోగ్య దోపిడీ!

ఆసుపత్రులు, ఏజెంట్ల మాయాజాలం, నిజమైన లబ్ధిదారులకు దక్కని వైద్యం, రామాయంపేట, కామారెడ్డిలో దందా

**ప్రజాపక్షం/రామాయంపేట:** ప్రజల ప్రాణాలకు భరోసా ఇవ్వాల్సిన ఇన్సూరెన్స్ రంగం ఇప్పుడు కొందరు కేటుగాళ్లకు కాసుల వర్షం కురిపిస్తుంది. ఆరోగ్య పరిస్థితి అత్యవసర స్థితిలో అండగా ఉంటుందని సామాన్యుడు కష్టపడి కడుతున్న ప్రీమియం సొమ్మును కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు, కొంతమంది ఇన్సూరెన్స్ ఏజెం ట్లు కుమ్మక్కై అడ్డగోలుగా కాజేస్తున్నారు. మెదక్ జిల్లా రామాయంపేటతో పాటు కామారెడ్డి ప్రాంతాల్లో ఈదందా మూడుపువ్వులుఆరుకాయలుగా సాగుతుంది. ఏడాది పొడవునా ఇన్స్‌రెన్స్ ప్రీమియం చెల్లించి క్లైయిమ్ చేసుకోని వారిని ముందుగా గుర్తించి వారిని టార్గెట్ చేస్తున్నారు. మీరు కట్టిన డబ్బులు వృథా అవుతున్నాయి క్లెయిమ్ చేస్తే మీకు కొంత వాటా లేదంటే ఓ ప్రీ మియం చెల్లిస్తామని పాలసీదారులకు ఆశ చూ పుతున్నారు. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తిని అనారోగ్యంతో ఉన్నట్లు ఆసుపత్రిలో చేర్చుకొని అసలు లేని రోగాలను ఉన్నట్లు చూపిస్తూ ల్యాబ్ రిపోర్టులు, స్కానింగ్ రిపోర్టులను సృష్టిస్తారు. వారం రోజుల పాటు చికిత్స పొందినట్లు రికార్డులు సిద్ధం చేసీ లక్షలాది రూపాయల ఇన్స్‌రెన్స్ క్లెయిం చేస్తారు. ఈకుంభకోణంలో ఇన్సూరెన్స్ ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకంగా మారింది. పాలసీదారుల సమాచారం మొత్తం వీరివద్దే ఉండడంతో ఎవరి క్లెయిం ఖాళీగా ఉందో గుర్తించి ఆసుపత్రి యాజమాన్యాలకు చేరవేయడంతో పాటు పాలసీదారులను డబ్బు ఆశ చూపి మభ్యపెడుతారు. ఇందుకు ప్రతిఫలంగా ఆసుపత్రుల యాజమాన్యం నుండి భారీగా కమీషన్లు దండుకుంటున్నారు. చివరకు ఇన్సూరెన్స్ మొత్తంలో పాలసీదారునికి ఇచ్చేది గోరంత అయితే ఆసుపత్రులు, ఏజెంట్లు తీసుకునేది కొండంత అనే ఆరోపణలు ఉన్నాయి. ఈఅక్రమ క్లెయింల వల్ల నిజంగా అనారోగ్యం బారిన పడి ఆసుపత్రికి వెళ్తే సామాన్యులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. అనవసరంగా క్లెయిం చేయడం వల్ల పాలసీదారునికి రావాల్సిన బోనస్ తగ్గిపోతుంది. రికార్డుల్లో ఒకసారి జబ్బు ఉన్నట్లు చూపిస్తే భవిష్యత్‌లో ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ఇన్సూరెన్స్ కంపెనీలు ముందే ఉన్న జబ్బుకు క్లెయిం ఇవ్వడానికి నిరాకరిస్తాయి. ఇలాంటి మోసపూరిత క్లెయింల వల్ల ఇన్సూరెన్స్ కంపెనీలు నష్టపోయి సామాన్యులపై ప్రీమియం భారాన్ని మోపుతున్నాయి.




కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అవుతున్నా వైద్యారోగ్య శాఖ, సంబందిత ఇన్సూరెన్స్ కంపెనీలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఆసుపత్రిలో చేరినట్లు రికార్డులు సృష్టించుకోవడం నేరం ఇది మీ భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టుతుంది. ఏజెంట్ల మాయమాటలు నమ్మి మోసపోవద్దని మేదావులు కోరుతున్నారు. రామాయంపేట, కామారెడ్డి పరిసరాల్లోని ఆసుపత్రుల రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తే ఈభారీ కుంభకోణం గుట్టు రట్టయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రత్యేక బృందాలతో విచారణ జరిపి ఈ అక్రమ దందాకు పాల్పడుతున్న ఆసుపత్రులతో పాటు ఏజెంట్లపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో.. అభివృద్ధి చెందాలి

కుమరం భీం కలెక్టర్ హరిత



**ప్రజాపక్షం / రెబ్బెన:** మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కుమరం భీం జిల్లా కలెక్టర్ కె హరిత ఆకాంక్షించారు. రెబ్బెన మండలంలో ఉమెన్స్ ఎంపవర్మెంట్ సొసైటీ అధ్యక్షురాలు కుసుమ విజయ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించారు. మహిళా సాధికారత కోసం ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్న సొసైటీ అధ్యక్షురాలు కుసుమ విజయను ఆమె అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని సామాజిక కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కాంబ్లే, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల మంగ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మోడం సుదర్శన్ గౌడ్, దుర్గం రాజేష్ పాల్గొన్నారు.

## బిసి వెల్ఫేర్ కార్యాలయ.. సీనియర్ అసిస్టెంట్ సస్పెండ్

**ప్రజాపక్షం/నిజామాబాద్:** జిల్లా బిసి వెల్ఫేర్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. తోటి ఉద్యోగులను వేధింపులకు గురి చేస్తున్నారని కారణంగా గత వారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి బిసి వెల్ఫేర్ సీనియర్ అసిస్టెంట్‌ను బిసి సంక్షేమశాఖకు సరెండర్ చేశారు. ఈ మేరకు బిసి సంక్షేమశాఖ కమీషనర్ సదరు సీనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి నర్సయ్యను వివరణ కోరగా ఈనెల 4 న సీనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేసిన ఉత్తర్వులు తనకందినట్లు తెలిపారు.

## ధాన్యం కొనుగోలులో తరుగు దోపిడీ

బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి

**ప్రజాపక్షం / మంచిర్యాల:** మంచిర్యాల జిల్లాలో ఎలాంటి తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం బిజెపి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రధాన రహదారిపై రైతు ధర్నా నిర్వహించారు. బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు బస్వ లక్ష్మి నారాయణ, జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ ఈ నిరసనలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరుగు పేరుతో బస్తాకు నాలుగు కిలోల చొప్పున రైతులను దోచుకుంటుందని విమర్శించారు. కాంటా వేసిన ధాన్యాన్ని తరలించడంలో లారీల కొరత కారణంగా ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యేలు రైస్ మిల్లర్లతో కుమ్మక్కై కమీషన్ల కోసం రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు ఎకరాకు 50 వేల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటీవల లక్సెట్టిపేట మండలంలో మృతి చెందిన నలుగురు రైతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి 50 లక్షల రూపాయల పరిహారం ఇవ్వాలని కోరారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతులకు రసీదులు అందజేయాలని, షరతులు లేకుండా వెంటనే ధాన్యం సేకరించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పంట సాగుపై రైతులకు అవగాహన

**ప్రజాపక్షం / వాంకిడి:** వాంకిడి మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రైతులకు పంట సాగు మెలకువలపై అవగాహన కల్పించారు.పిఎసిఎస్ చైర్మన్ జబోరే పెంటయ్య అధ్యక్షత వహించారు. ఉమ్మడి జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొని ఆధునిక వ్యవసాయ పద్ధతులు, అధిక దిగుబడులు సాధించే మార్గాలను వివరించారు. ముఖ్యంగా యూరియా ఎరువులను అవసరానికి మించి వాడకూడదని, మట్టి పరీక్షల ఆధారంగానే ఎరువుల వినియోగం ఉండాలని సూచించారు. నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం రైతుల భవిష్యత్తుకు ఎంతో ముఖ్యమని అధికారులు తెలిపారు. రసాయన ఎరువుల అధిక వినియోగం వల్ల భూమి సారవంతత తగ్గే ప్రమాదం ఉందని, సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచాలని కోరారు. మట్టి పరీక్షలు చేయించుకోవడం ద్వారా పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవచ్చని వివరించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్న అధికారులు తగిన సలహాలు అందించారు.మండలంలోని పలువురు రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## చదువుకోవాలని మందలించడంతో విద్యార్థిని ఆత్మహత్య



**ప్రజాపక్షం / జన్నారం:** పరీక్షలు సరిగా చదవమని తల్లి దండ్రులు మందలించడంతో మనస్తాపం చెందిన ఓ డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. జన్నారం ఎస్ఐ జి. ఉదయ్ కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రోటిగూడ గ్రామానికి చెందిన మోత్కూరి అక్షయ (19) లక్సెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. ప్రస్తుతం వార్షిక పరీక్షలు జరుగుతుండగా, అక్షయ ఇంట్లో ఎక్కువగా టీవీ చూస్తుండటంతో తల్లిదండ్రులు చదువుపై దృష్టి పెట్టాలని మందలించారు. ఈ నెల 3న ఉదయం తండ్రి లక్ష్మి నారాయణ గౌడ్, తల్లి పనికి వెళ్లే ముందు అక్షయను చదువుకోమని చెప్పి టీవీ ఆఫ్ చేసి వెళ్లారు. దీంతో మనస్తాపానికి గురైన అక్షయ ఇంట్లోని గడ్డి మందు తాగింది. వెంటనే జన్నారంలోని ప్రైవేట్ ఆసుపత్రికి, అక్కడి నుండి మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని సన్‌రైజ్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున అక్షయ మృతి చెందింది. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

